క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కంకిపాడు: చదువుతో పాటు ఆటల్లోనూ ప్రతిభ చాటాలని కంకిపాడు గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలు కంకిపాడు శాఖ గ్రంథాలయంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌లో శిక్షణ ఇచ్చారు. రామకృష్ణ మాట్లాడుతూ ఆసక్తిగల రంగాలను ఎంచుకొని రాణించాలన్నారు. క్రమశిక్షణతో సామాజిక బాధ్యతతో మెలగాలని సూచించారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, గణితంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

రామవరప్పాడు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో వరి విత్తనాలు ఉన్నాయని రైతులు సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి రంగనాథ్ బాబు బుధవారం తెలిపారు. వరి విత్తనాలు (ఎంటీయు 1061, బీపీటీ 5204) రకాలను రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై ఇస్తున్నారని కావాల్సిన రైతులు తీసుకెళ్లవలసిందిగా సూచించారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

రామవరప్పాడు: ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించడం మనందరి బాధ్యతని, ఆపదలో ఉన్న వారిని గుర్తించి కాపాడుకుందామని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లో బుధవారం ముఠా కార్మికులకు 'బాలల పరిరక్షణ'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలలతో పనిచేయించడం నేరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, సంరక్షకులు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. బాలలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నూజివీడు సమీపంలోని పోలసానిపల్లి గ్రామంలో బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

రామవరప్పాడు: కొత్తూరు తాడేపల్లిలోని శ్రీ అలిగినేని పెద ముత్తయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ నగదు పురస్కారానికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.కమలాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ -23 జాతీయ ఉపకారవేతన పరీక్షలో పాఠశాల విద్యార్థులు రమావతు లక్ష్మి, వట్టూరి నాగసాయి, పామర్తి హరిగణేష్ ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.12వేలు చొప్పున నాలుగు సంవత్సరాలకు గాను ఒక్కొక్కరికి రూ.48వేల చొప్పున వారి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ ఉయ్యూరు వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

పెనమలూరు తహసీల్దార్‌గా వెంకటశివయ్య



పెనమలూరు: పెనమలూరు మండల తహసీల్దార్‌గా కె. వెంకటశివయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన భద్రు ఏసీబీకి చిక్కడంతో ఆయన స్థానంలో కంకిపాడు తహసీల్దార్ టీవీ సతీష్‌ను ఇన్‌చార్జిగా వేశారు. అయితే ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో బదిలీలు జరగటంతో పెనమలూరు తహసీల్దార్‌గా కె.వెంకటశివయ్యను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వెంకటశివయ్య ప్రస్తుతం తోట్లవల్లూరు తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. వెంకటశివయ్య 2013 నుంచి తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. మైలవరం, ఇబ్రహీంపట్నం, కార్పొరేషన్ ఎస్టేట్ అధికారిగా విధులు నిర్వర్తించారు. తహసీల్దార్ గురువారం పెనమలూరులో పదవీ బాధ్యతలు తీసుకుంటారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

లక్ష్యం.. ఇంటింటికీ సు'జలం'

- శరవేగంగా రక్షిత మంచినీటి పథకం పనులు
- రూ. 2.37 కోట్లతో నిర్మాణం
- కంకిపాడు వాసులకు సమృద్ధిగా తాగునీరు



కంకిపాడులో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం

కంకిపాడు: రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు చక చకా సాగుతున్నాయి. ట్యాంకు నిర్మాణం 80 శాతానికి పైగా పూర్తయ్యింది. విద్యుత్ సదుపాయం కల్పించాల్సి ఉంది. చురుగ్గా పైపులైన్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. రానున్న రోజుల్లో కంకిపాడు ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీటిని సమృద్ధిగా అందించేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం, పాలకవర్గాలు కృషి చేస్తున్నాయి.

రూ. 2.37 కోట్ల నిధులు మంజూరు..

మండల కేంద్రమైన కంకిపాడు పట్టణ వాసులకు సురక్షిత తాగునీటిని సమృద్ధిగా సరఫరా చేసేందుకు గానూ జలజీవన్ మిషన్ ఇంటింటికీ నీటి కుళాయి కార్యక్రమం కింద రూ. 2.37 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలోని లాకు రోడ్డులోని పద్మావతి నగర్ ప్రాంతంలో సామాజిక స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలంలో 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పైగా నిర్మాణం పూర్తయ్యింది. నీటిని మళ్లించేందుకు ఒక బోరు తవ్వించారు. విద్యుత్ సదుపాయం కల్పనకు అధికారులు నివేదికను విద్యుత్ శాఖకు పంపారు. నిర్మాణ పనులను పంచాయతీ సర్పంచ్ బాకీ రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

వేగంగా పైపులైన్ విస్తరణ పనులు..

గ్రామం అంతటా పైపు లైన్ విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రామం అంతటా 12 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరించాల్సి ఉంది. ఇప్పటికే 7 కిలోమీటర్లు మేర పైపులైన్ విస్తరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకం అందుబాటులోకి వస్తే పట్టణ ప్రజలకు సమృద్ధిగా సురక్షిత తాగునీరు, ఇంటింటికీ నీటి కుళాయి సమకూరనుంది.

త్వరితగతిన పూర్తి చేస్తాం..

> జలజీవన్ మిషన్ కింద 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం పనులు వేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ సదుపాయం కల్పించేందుకు నివేదిక పంపాం. విద్యుదీకరణ పూర్తి కాగానే ట్యాంకును ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.
>
> – సుబ్బారావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కంకిపాడు

రేపటి నుంచి విగ్రహాల ప్రతిష్టా మహోత్సవాలు



స్వామివారి విగ్రహాలు

పెనమలూరు: యనమలకుదురు సంజీవయ్యనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ సీతారామాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరగనుంది. ఆలయంలో శ్రీ లక్ష్మణ హనుమత్ శ్రీ సీతారామస్వామివార్ల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో 9వ తేదీన సాయంత్రం విష్వక్సేన పూజ, అంకురార్పణ, వాస్తు హోమం పూజలు చేస్తారు. 10వ తేదీన ఉక్తహోమం, క్షీరాధివాసం, యాగశాల ఆరాధన తదితర పూజలు నిర్వహిస్తారు.11వ తేదీన 108 మంది స్త్రీలచే జలాధివాసం, గ్రామోత్సవం జరిపిస్తారు. ఇక 12వ తేదీన ఉదయం శ్రీ సీతారామ, లక్ష్మణ ఆంజనేయ స్వామివార్ల శిలా విగ్రహాల ప్రతిష్ట చేస్తారు. పూర్ణాహుతి, శాంతికల్యాణం, ఆడపడుచులు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. ఉదయం 11 గంటలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

చంద్రశేఖర స్వామి ఆలయ ప్రతిష్ట



యాగశాలలో హోమాల మధ్య శాంతి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం శ్రీ పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవం బుధవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. గణపతి, శివలింగ, పార్వతీ, కుమారస్వామి, ద్వారపాలక, నందీశ్వర, ధ్వజ, బలపీఠ, చండీశ్వర, కాలభైరవ, నాగబంధ, నవగ్రహ ప్రతిష్టలు గడచిన అయిదు రోజులుగా పంచాహ్నిక దీక్షతో నిర్వహించారు. గణపతి శర్మ పర్యవేక్షణలో ఉదయం గవ్యాంత పూజలు నిర్వహించి యంత్రస్థాపన చేశారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ధ్వజ స్తంభాన్ని నిలబెట్టారు. అనంతరం పదుల సంఖ్యలో పాల్గొన్న దంపతులు స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు. యాగశాల వేదపండితుల మంత్రాలతో, విశేష పూజలతో అలరించింది. అనంతరం శివకేశవ ఆలయ అభివృద్ధి కమిటీ పండిత సత్కారం చేసింది. వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పురుషోత్తపట్నం గ్రామం ప్రతిష్టా ఉత్సవంతో తరలివచ్చిన భక్తులతో నిండిపోయింది.

రసాయనాలతో భూసారానికి దెబ్బ



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రామ్మోహన్‌రెడ్డి

కాజ(మొవ్వ):రైతులు అవలంబిస్తున్న రసాయన వ్యవసాయం వల్ల పెట్టుబడులు అధికమవ్వటమే కాకుండా భూసారం దెబ్బతింటుందని మాస్టర్ ట్రినర్ రామోహన్ రెడ్డి సూచించారు. బుధవారం మొవ్వ మండలం కాజ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో తొలకరి ముందు నవధాన్యాల సాగు పద్ధతి పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. 32 రకాల విత్తనాలతో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో విత్తుకోవటం వల్ల పంట మార్పిడి జరుగుతుందని తెలిపారు. తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు భూమికి అంది దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే నవధాన్యాలు సాగు చేసి నేలలో కలియ దున్నటం మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో నవదాన్యాల కిట్లులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ యాంకర్ గొంగి పోతలయ్య, వీఏ హేస్సేన్, యూనిట్ ఇన్‌చార్జ్ విజయ భాస్కర్ రెడ్డి, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు, రైతులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు ఆహ్వానం



ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: సొంతింటి కలను నెరవేరుస్తూ జననేత జగనన్న చేతుల మీదుగా జరుగుతున్న టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలకు రావాలని ఐదో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. వార్డులో బుధవారం ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 9వ తేదీ పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా ఉదయం 7 గంటలకు వార్డుకు చెందిన కట్టా సాంబయ్య ఇంటివద్ద అల్పాహారం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అక్కడ నుంచి బస్సులో సభాస్థలికి వెళతున్నామని, అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అర్జా ప్రసాదు, వెంపల అప్పారావు, పీవీ లక్ష్మణరావు, కె మహాలక్ష్మి, గంగాధరరావు, సీహెచ్ భాగ్యలక్ష్మి, మరడాని హరిత, కట్టా శాంతి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొజ్జగాని కోటమ్మ, పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



పెనమలూరు: పోరంకిలో బుధవారం వాసవీ క్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వైస్ గవర్నర్ కొత్తా గణేష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ పోరంకి వాసవీ క్లబ్ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల కోసం గత 75 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తుందన్నారు. పోరంకి వాసవి క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందుండటంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెంకటమస్తాన్, కార్యదర్శి పెనుగొండ హారిక, ట్రెజరర్ కారంశెట్టి శైలజ పాల్గొన్నారు.

పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ఉంగుటూరు: సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్-1) బదిలీ అయినట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. పెద అవుటపల్లి కార్యదర్శి ఎం.సరోజిని తరిగొప్పులకు, బాపులపాడు మండలం ఆరుగొలను కార్యదర్శి బి.దీప్తి పెద అవుటపల్లికి నియమితులయ్యారు. ఇందుపల్లి పంచాయతీ కార్యదర్శి నర్రా ప్రసాద్ ఉంగుటూరుకు బదిలీ కాగా ఇందుపల్లికి మైలవరం మండలం వెల్వడం గ్రామ కార్యదర్శి బి.కోటేశ్వరరావు వచ్చారు. తోట్లవల్లూరు మండలం పెనమకూరు పంచాయతీ కార్యదర్శి కె.పిచ్చియ్య నందమూరుకు బదిలీ అయ్యారని ఎంపీడీవో వివరించారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బుధవారం బదిలీ అయ్యారు. ఎ.సీతారామపురం పంచాయతీ కార్యదర్శిగా డి.తావిర్యా నియమితులయ్యారు. ప్రస్తుతం తోటవల్లూరు మండలం భద్రిరాజుపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. మడిచర్ల పంచాయతీ కార్యదర్శిగా చాగంటిపాటి ఆంజనేయులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పెదకూరపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మండలంలోని మల్లవల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పి.సురేష్ కుమార్ ఆరుగొలను పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

వ్యక్తిపై బీరు సీసాతో దాడి

పెనమలూరు: కానూరులో వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్ పెద్ద మసీదు ప్రాంతానికి చెందిన చింతాశ్రీను ఆటోనగర్‌లో జిల్లా రాజు వద్ద వెల్డింగ్ పనులు చేస్తాడు. అయితే మంగళవారం అతని మిత్రుడు తిరుమలశెట్టి శివశంకర్ ఫోన్ చేయటంతో శ్రీను, రాజు కలిసి మద్యం తాగటానికి కానూరు శివారులో ఉన్న శ్మశానవటిక వద్దకు వెళ్లారు. అక్కడ మద్యం తాగుతున్న సమయంలో వివాదం తలెత్తి శ్రీనుపై శివశంకర్ బీరు సీసాతో దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్బీకేల ఏర్పాటుతో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే వంశీ



ఆర్బీకే ప్రారంభోత్సవంలో రైతులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే వంశీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ఆర్బీకేలు రైతులకు ఎంతో అండగా నిలుస్తున్నాయన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు రాయితీపై అందించటం, ధాన్యం కొనుగోళ్లు వంటి అన్ని సేవలు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లోనే అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించటం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని, అధిక దిగుబడిని సాధించవచ్చని వివరించారు. నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట దిగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతులకు 32 రకాల నవధాన్యాలతో కూడిన విత్తనాలను రైతులకు ఎమ్మెల్యే వంశీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి ఏడు సెంట్ల భూమిని విరాళంగా అందించిన మాజీ సర్పంచ్ అడపా యుగంధరరావును ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు చిత్రా అంజిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్‌లు అడపా అంజిబాబు, చెన్నుబోయిన వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పడకల వీర్రాజు, ఏఓ జొన్నలగడ్డ భవాని, వీఏఏలు పూర్ణచంద్రరావు, రాజేష్ ఖన్నా, ప్రకృతి వ్యవసాయ విభాగం శిక్షణ ప్రతినిధి జి.గంగరాజు, ఐసీఆర్పీ పి.లీల రంగమ్మ పాల్గొన్నారు.

సనత్‌నగర్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సనత్‌నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో 20 ఏళ్లుగా స్థానికులు ఎదురు చూస్తున్న సిమెంట్ రోడ్డు పనులు బుధవారం ఎట్టకేలకు ప్రారంభం అయ్యాయి. సనత్‌నగర్ పెద్ద మసీదు వద్ద ఉన్న సిమెంట్ రోడ్డు పల్లం కావటంతో డ్రైనేజీ మురుగు నీరు రోడ్డు పైకి చేరి నిలిచిపోతోంది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. నడవటానికి కూడా అవకాశం లేకుండా పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో స్థానికులు రోడ్డు సమస్య ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత టీడీపీ పాలనలో రోడ్డు సమస్య చెప్పినా ఎవ్వరూ పట్టించుకోలేదని, తమకు రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు కోరారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పార్థసారథి తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ ప్రకాశరావును ఆదేశించి రూ. 6.50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు చాంద్‌బాషా, ఖాదర్, పఠాన్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నేత రెహమాన్ పనులు పర్యవేక్షిస్తున్నారు.

మునిసిపల్ కార్మికులు పోరాడాలి



ప్రసంగిస్తున్న రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ కార్యదర్శి ఉమామహేశ్వరరావు

పెనమలూరు: రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులు హక్కుల సాధనకు పోరాడాలని రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ కార్యదర్శి పి.ఉమామహేశ్వరరావు అన్నారు. మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర జాత బుధవారం వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీకి రావటంతో మునిసిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు రాఘవయ్య పార్కు వద్ద ఉన్న ఎంబీకే భవన్‌లో సభలో కార్మికులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సీఐటీయూ నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్ మస్తాన్‌వలి, సరళ, రెడ్డయ్య, డేవిడ్‌రాజు, జోజిమేరీ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం : గృహోపకరణాలు దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక వేలేరురోడ్డులోని పోలీస్ సర్కిల్ కార్యాలయం సమీపంలోని ఓ భవనంలో బుధవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. తాళాలు వేసి ఉన్న ఓ ఇంట్లో ఆకస్మాత్తుగా మంటలు, దట్టమైన పొగలు వ్యాపించటంతో ఇరుగుపొరుగు వారు భయాందోళనకు గురయ్యారు. ఆ భవనంలో ప్రవీణ్‌కుమార్ కుటుంబం అద్దెకు నివసిస్తున్న గదిలో అగ్నిజ్వాలలు ఎగసిపడటం గుర్తించిన సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ వెంటనే స్పందించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈలోగా ఇంట్లోని గృహోపకరణాలు, టీవీ దగ్ధమయ్యాయి. ప్రాథమికంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించినట్లుగా భావిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ మోహనరావు చెప్పారు.

పకడ్బందీగా 'ఫ్యామిలీ డాక్టర్'



జమీదగ్గుమిల్లిలో వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు వంశీకృష్ణ

జమీదగ్గుమిల్లి(పామర్రు): ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ)ని అత్యంత పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజలకు ఉన్నతమైన వైద్యసేవలను అందించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వేదాంతం వంశీ కృష్ణ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన శైలి జబ్బుల బాధితులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ ఫలానా గ్రామానికి ఫలానా రోజు వస్తారనే వివరాలను ముందుగానే వెల్లడిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో గ్రామానికి డాక్టర్లు వస్తున్నట్లు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలందరికీ తెలియజేస్తామన్నారు. డాక్టర్ వద్దకు వచ్చి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఎఫ్‌పీసీని మెరుగ్గా ముందుకు తీసుకెళ్లేలా సమర్థులైన అధికారులు సేవలను వినియోగించుకోవాలని కోరారు. గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా రక్త హీనత సమస్యను ఎదుర్కొనే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామ సర్పంచ్ కె చంద్రశేఖర్ రావు, సీహెచ్‌వో బి ఉదయ్ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం ఆదాంటీ, 104 వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని వినాయక దేవస్థానంలో సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కుందుర్తి మురళీశర్మ నేతృత్వంలో గణేశుడికి గరిక పూజ, పంచామృతాలతో అభిషేకం, పండ్లు, చెరకు రసంతో విశేష అభిషేకాలు వైభవోపేతంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని నైవేద్యాలుగా ఉండ్రాళ్లు, వడ పప్పు, చలివిడి, పానకం సమర్పించారు.

విద్యార్థులు రోజూ దినపత్రికలు చదవాలి

గన్నవరంరూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి రోజూ న్యూస్ పేపర్ చదవటం అలవాటు చేసుకోవాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక లైబ్రరీలో విద్యార్థులకు పేపర్ రీడింగ్ నిర్వహించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల పర్యవేక్షణలో విద్యార్థులు దినపత్రికలు చదివి ఆ విషయాలు చర్చించారు.

అంగన్‌వాడీల మరమ్మతులకు రూ.7లక్షలు మంజూరు

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల అభివృద్ధికి మండల పరిషత్ నిధులు రూ.7లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ వి.సరోజిని తెలిపారు. వెన్నూతల గ్రామంలో జరుగుతున్న అంగన్‌వాడీ భవనం అభివృద్ధి పనులను ఎంపీపీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతలు పాటించాలని సూచించారు. ఆత్కూరు, పొట్టిపాడు ఆనందపురం, పెద అవుటపల్లి, గారపాడు గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు, వంటగది అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, సర్పంచ్ రామ్మోహన్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాతల్లో చైతన్యం తేవాలి

గన్నవరంరూరల్: రక్తదాతలతో కౌన్సిలర్‌లు మాట్లాడి వారిలో చైతన్యం తేవాలని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల పెథాలజీ ప్రొఫెసర్ కళ్యాణ చక్రవర్తి కౌన్సిలర్‌లకు మార్గనిర్దేశనం చేశారు. స్థానిక కళాశాలలో బుధవారం ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ సాక్స్) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి మెడికల్ కళాశాలల బ్లడ్ కౌన్సిలర్‌ల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(నాకో) ఆదేశాల మేరకు డొనేషన్ ముందు రక్తదాతకు సమాచారం ఇవ్వాలని, డొనేషన్ చేసినప్పుడు, అనంతరం సైతం కౌన్సెలింగ్ చేయాలన్నారు. దేశంలో రక్తదాతల సంఖ్య పెంచేందుకు, నిల్వలు పెంచేందుకు కృషి జరగాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ జాస్మిన్ సుల్తానా నాకో నిబంధనలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఉయ్యూరు గ్రూపు దేవాలయములు
ఉయ్యూరు టౌన్ మండలం, కృష్ణాజిల్లా.
మాగాణి భూములు కౌలు బహిరంగ వేలం ప్రకటన

[illegible]

క్ర.సం.	దేవస్థానం పేరు	సర్వే నెం.	విస్తీర్ణం	ధరావత్తు	కాలపరిమితి	వేలం జరుగు ప్రదేశం
1.	శ్రీ సోమేశ్వరస్వామి వారి దేవస్థానం, ఉయ్యూరు	[illegible]	6-30	[illegible]	2023-24 నుండి 2025-26 వరకు	శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం [illegible]
2.	శ్రీ సోమేశ్వరస్వామి వారి దేవస్థానం, ఉయ్యూరు	[illegible]	[illegible]	[illegible]	2023-24 నుండి 2025-26 వరకు	శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం [illegible]
3.	శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం, ఉయ్యూరు	[illegible]	[illegible]	[illegible]	2023-24 నుండి 2025-26 వరకు	శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం [illegible]

[illegible]

ఉయ్యూరు, తేది : 07/06/2023 — [illegible] కార్యనిర్వహణాధికారి